బుధవారంనాటికి తనని విశాఖపట్నం రమ్మని వ్రాసేడు కళికిమూర్తి. ఆరోజు తనకి తెలిసిన ఒక కంపెనీలో ఇంటర్వ్యూ జరుగుతుందనీ, హాజరైతే వెంటనే ఉద్యోగం వచ్చేటట్టు చూస్తాననీ.

అప్పుడే మంగళవారం వచ్చింది

ఇంటర్వ్యూ రేపే—పదిగంటల్లోగా చేరుకోవాలి.

ఉత్తరం శనివారం సరికే అందింది.

విశాఖపట్నం వెళ్లిరావడానికి కనీసం వంద రూపాయిలైనా కావాలి. వందరూపాయిలకోసం నాన్న రెండు మూడు రోజులుగా ఎన్ని గడపలు ఎక్కేరో తను చూస్తూనే ఉన్నాడు.

ఈ పల్లెలో భాగంగా, ఈ పల్లీయుల కష్టసుఖాలతోపాటూ స్పందిస్తూ గత ముప్పైఏళ్లుగా ఈ గ్రామాన్నంటి పెట్టుకున్న తమ కుటుంబానికి ఏమంత గుర్తింపు ఉందని!?

అతికష్టంమీద డబ్బు సంపాదించగలిగేరు నాన్న.

పల్లెల్లో డబ్బుగల కామందులు ఎందరో ఉన్నారు.

వాళ్లకి నిరుపయోగమైన డబ్బుని ఇనప్పెట్టెల్లో అతిభద్రంగా దాచుకుంటున్నారు.

అందులో ఏ కొద్దిపాటి డబ్బో కొన్ని బడుగు జీవితాన్ని నిలబెట్టగలదని తెల్సినా ఏమీ తెలియనట్టు నటిస్తున్నారు. అయినా ఒకరి జీవితాన్ని సరిదిద్దడానికి మరోడు ముందు కెందుకొస్తాడు?

మర్రిచెట్టు నీడలో పల్లెపాదు జీవనం దిద్దుకోదు.

పడగ నీడలో కప్పపిల్ల సేద తీర్చుకోలేదు.

అన్నీ తెలిసినా, ఏదో ఆశ—యాంత్రికమైన జీవితాన్ని నడిపిస్తోంది.

ఆలోచనలు దిగంతాల్లోకి పరుగులు తీస్తుంటగా దూరంగా గాలితోపాటు తే వస్తున్న సన్నని ఏడుపుతో ఈ లోకంలోకి వచ్చేడు సత్యం.

చీకటి దట్టమయింది అవనీతలా.

చుక్కలు తన గుండెల్లో ఆశల్లా మిణుకు మిణుకు మంటున్నాయి. నక్షత్రాల కాంతి దారి చూపలేనట్టే తన ఆశలూ తనని ముందుకి తీసుకపోలేవు.

ఏడుపు క్రమంగా దగ్గరయింది. దూరంగా కొరివి దెయ్యాల్లా కన్పించిన లాంతర్లు చేరువయ్యాయి. వచ్చిన గుంపు తమ ఊరివాళ్లే!

నలుగురు మనుషులు మంచాన్ని మోసుకొచ్చేరు. ఆ మంచంలో మూల్గుతూ, ఉండుండి చుట్టుకుపోతూ నారాయణ. నారాయణ నోట్లోంచి తెల్లని నురగ.

మొహమంతా నీలంగా కమిలిపోయి వికృతంగా కన్పిస్తున్నాడు.

"ఏవయింది రావులూ ?"

"నారాయణకి పురుగు ముట్టుకుంది బాబూ... దండాసి మంత్రం వేసేడు గానీ విషం దిగలేదు. పలాసా తీసికెళ్లి డాక్టరుకి చూపిద్దామని —"

సత్యం నారాయణవైపు జాలిగా చూసేడు. ఈ పల్లెల్లో ఇలాటివి మామూలే!

చుట్ట వెలిగించుకున్నాడు రావులు "బస్సింకా రాలేదా సత్యం బాబూ ?"

"రాలేదు రావులూ... నేనూ బస్సుకోసమే చూస్తున్నాను."

నారాయణ పెళ్లాం ఏడుస్తోంది. ఆమెకి వంతగా మరో ఇద్దరు. ఆ ఏడుపుల్లోంచి, జనం రొదగా మాట్లాడే ఉక్రోశం నుంచి కొద్ది కొద్దిగా అంతా అర్థమయింది సత్యానికి.

కావందు నారాయణని కొబ్బరి తోటకి కంచె కట్టేందుకు పంపేడు సందెవేళ. కంచె కట్టుండగా మాయదారి పురుగు ముట్టింది. తిన్నగా దండాసి ఇంటికి వెళ్లేడు నారాయణ. దండాసి మంత్రం వేస్తుండగనే తెలివి తప్పి పడిపోయాడు. కావందుని ఎడ్లబండి అడిగేరు పట్నం తీసికెళ్దామని. కావందు ఒప్పుకోలేదు.

కావందు కూతురు ఆ బండిలోనే మూడు మైళ్ళ దూరానున్న రాజపురం హైస్కూలుకి చదువుకోడానికి పోతుంది ప్రతిరోజూ.

"ఆఖరి బస్సు ఎలానూ ఉంది కదరా, నాలుగడుగులేసేరంటే అరగంటలో పట్నం చేరుకోవచ్చు" ననే ఉచిత సలహా ఇచ్చాడు కావందు. కావందుని శపిస్తున్నారు పేదకూలీలు.

గుంపులో ఉండే ఆవేశం, ఉక్రోశం విడివిడిగా వీళ్లలో శూన్యం.

తెల్లారి అందరూ కావందు కాళ్లకి మొక్కేవాళ్లే. ఈ అందరి జీవితాలు సుడిగాలిలో చిక్కుకున్న గాలిపటాలే. ఆ గాలిపటాల దారపు కొసలు కావందుల బంగారాల చేతుల్లో బిగుసుకున్నాయి.

కావందు గానీ దారంకొస విడిచిపెడితే దిక్కు తెలియని ఈ పిచ్చి జీవితాలు ఎటో కొట్టుకుపోతాయి.

సత్యం మనసులో భావ సంఘర్షణ.

మెదడు వేడెక్కిపోయింది ఆలోచనా పరంపరతో.

సంఘర్షణకి, వాస్తవానికి రాజీ కుదరదు.

కాలంతోపాటు కొన్ని బ్రతుకులు సాగిపోతుంటాయి ఏ అర్థమూలేకనే. వాళ్లతోపాటు తనూ బస్సుకోసం ఎదురుచూస్తున్నాడు.

* * *

మరో మూడుమైళ్ళ దూరంలో — చిన్న నీలావతి అడ్డరోడ్డు దగ్గర— నిర్మానుష్యమైన వాతావరణంలో ముసిలి దెయ్యంలా టీ పాక—

ఆ పాకలో బిక్కుబిక్కుమంటూ కూర్చుంది యశోద.

చీటికి మాటికీ చీకట్లోంచి రోడ్డువైపు చూస్తోంది. తన బ్రతుకుని సరిదిద్దగలిగే వరదేవతలా కనిపించింది నల్లని తార్రోడ్డు. ఇంతవరకూ చీకట్లోనే కొట్టుకొంటున్న తన బ్రతుకుని ఈ రోడ్డు వెలుగుల్లోకి నడిపిస్తుందన్న గట్టి నమ్మకం.

మరికొద్ది సేపట్లో ఈ పరిసరాలకి, తనకి మిగిలినబంధం తెగిపోతుంది. కాశీబుగ్గ బస్టేండులో రాఘవరావు తనకోసం ఎదురుచూస్తుంటాడు. రాఘవరావు తలపుల్లోకి వస్తే తన బుగ్గల్లో మందారాలు విరుస్తా యెందుకనో?

విశాలమైన అతని ఛాతీమీద ఒరిగిపోతే ప్రపంచంలో మరేమీ కన్పించదు. పొడవైన అతనివేళ్లు తన కురులు సవరిస్తుంటే గుండెల్లో తియ్యని వీణానాదం ఆ వీణానాదంలో మోహనరాగం తను బ్రతుకంతా కోరుకునే వరం. ఇంత తియ్యని వరాన్ని దూరం చేద్దామని కసికట్టుగా ప్రయత్నించే బంధువర్గం.

బంధువులా—రాబందులు వాళ్లు!!

తనను గుండెలమీద అల్లారుముద్దుగా పెంచుకున్న నాన్న కూడా వాళ్లలో చేతులు కలిపేడు.

ముచ్చటగా పెంచుకున్న అందాల రామచిలుకని చేతులారా చంపుకుంటున్నారు.

తన బతుక్కి శాశ్వతంగా సమాధి కట్టబోతున్నారు.

చెన్నకేశవులు ఈ తాలూకా మొత్తాన్ని కొనెయ్యగల ధనవంతుడే కావచ్చు, ఒంటరిగా పదిమంది రౌడీలని నేలకరిపించే బలవంతుడే కావచ్చు.

అయినా అతనితో జీవితాన్ని పంచుకోడానికి మనసు రాజీపడదు.

రాఘవరావు ఈ ఊళ్లో వి. డి. ఓ. గా జాయినవుతూనే తన గుండెల్లో తియ్యని కలవరం రేకెత్తించాడు.

ఊహ తెలిసిన కొత్తలో కలలో అప్పుడప్పుడు మురిపిస్తూ, ఆ అనుభూతిని కొన్నాళ్ల పాటు నిలిపే అందగాడు రాఘవరావులో కన్పించేడు.

అతన్ని చూస్తూనే విశ్రాంతి చెందింది. తనకోసం దేవుళ్లు పంపించిన నలచక్రవర్తిలా అనిపించాడు.

తన కళ్లలో భావాల్ని అతిసులభంగానే ఏరుకున్నాడు రాఘవరావు.

ఎంతచక్కగా మాట్లాడతాడు!! ఆ మాటల్లో పొందిక, తేనెపనస తొనల్లాటి తియ్యదనం కలకాలం తను కోరుకునేది!

వెలకట్టలేని వజ్రంలాంటి రాఘవరావుని కాదని, గుడ్డి గవ్వలాటి చెన్నకేశవుల సాంగత్యం తన కక్కర్లేదు.

చెన్నకేశవులు ఎవరి పెళ్లిలోనే తనని చూసి ముచ్చట పడ్డాడు. తనని పెళ్లిచేసుకుంటానంటూ నాన్నకి కబురెట్టేడు. నాన్నతో పాటు బంధువర్గమంతా తనఅదృష్టానికి మురిసిపోయారు. పెళ్ళికాని కొందరు పడుచులు కొద్దిగా అసూయపడ్డారు

## నిరాశ

చిగురువంటి చిన్నారిపాపలు
చేత పలకలు పట్టుకొని
బళ్లో కెడుతూంటే
నా దేశానికేం ? అన్న ధైర్యం నాకు.
కాని
ఆ గులాబీ కన్నుల్లో కన్నీళ్లు
చిరుగుల గుడ్డలు
వెన్నుతో నేస్తం కట్టిన పొట్టలు చూచి
ఇదా నా దేశం ? అన్న నిరాశ నాకు.

— ఎస్ ముకుసుందరం

తన మనసులో ఉన్నమాట అతికష్టమ్మీద పెదవి పెగల్చి అమ్మతో చెప్పింది కొన్ని క్షణాల్లో ఇంట్లో కార్చిచ్చు.

పెద్దన్న రాఘవరావుని ఏమని బెదిరించాడో గానీ, రాఘవరావు నెలరోజులయింది శెలవు మీద ఈ ఊరి విడిచి.

నగలు, నాణ్యాలు కోరినదే తడవుగా సమకూర్చిన నాన్న తన శాశ్వతమైన ఆనందానికి నిప్పంటిస్తున్నాడెందుకనో!

రాఘవరావుది తమకులం కాకపోవచ్చు. అతను తమలా మోతుబరి కాకపోవచ్చు — అయినా వేలెత్తి చూపగలిగే లోపం అతనిలో ఎక్కడుంది?

ఈ కులాలు, అంతస్థుల తారతమ్యాలు ఎంతవరకు ఇలా అడ్డు నిలుస్తాయి? పుట్టుకముందు తెలియని కులం, సుందె ఆగిపోయేకా వెనుకరాని కులం — ఇన్ని జీవితాల్ని గ్రహణం పట్టిస్తుందెందుకో?

తనని పెళ్లి కూతుర్ని చేసి అప్పుడే రెండు రోజులయింది.

కన్నీరు మున్నీరుగా తనలో సుళ్లు తిరిగే దుఃఖం ఎవరినీ కదిలించలేక పోయింది.

తన కన్నీటికి మరోలా భాష్యం చెప్పుకున్నారు చుట్టాలు.

"తప్పమ్మా—కంటతడి పెట్టకూడదు. ఆడపిల్ల ఎప్పుడూ తన ఇంటికి పరాయిదే. పెళ్లితో ఈ ఇంటిని విడిచి పెడ్తామేగానీ, అనుబంధం మరింత పెనవేసికుంటుంది" అంటూ ఓదార్చింది పలాయ్‌నుండి వచ్చిన మేనత్త.

ఉదయం ఇంటిముందు మ్రోగే సన్నాయి వాద్యం తన గుండెల్లో కంపరాన్ని రేకెత్తించింది.

చెన్నకేశవులితో తను పంచుకోబోయే జీవితానికి విషాదం ప్రతిధ్వనించింది.

ఈ రాత్రితో తన బ్రతుకు మంటగలవాల్సిందే.

చెన్నకేశవులు తన మందీమార్బలంతో ఉదయమే విడిదిచేసేడు.

అతనితో తోట సంబరంలో కూచున్నప్పుడు ఒళ్లంతా సలసల మరిగిపోయింది.

రాఘవరావు ప్రతిక్షణం గుర్తుకి వచ్చి రక్తమంతా గడ్డకట్టుకుపోయింది.

మంగమ్మ తను ఒంటరిగా ఉన్న సమయం చూసి రహస్యంగా తనతో చెప్పిన ఆ మాట విన్నంత వరకు మనసు తేలిక పడలేదు.

రాఘవరావు కాశీబుగ్గ బస్టాండులో ఎదురు చూస్తుంటాడట. ఆఖరి బస్సుకి తను వస్తే అన్నవరం కొండమీద పెళ్లిచేసుకుంటాడట

ఖరీదైన నగల్తో అమ్మ తనను అలంకరించింది బలిపశువులా.

బరంపురం పట్టుచీర చుట్టబెట్టి తనను బొమ్మలా ముస్తాబు చేసేరు. వచ్చిపోయే స్నేహితురాళ్లు, రెండుప్రక్కలచుట్టాలు తనకి క్షణంకూడా తీరిక లేకుండా చేసారు.

అందర్నీ తప్పించుకు రావడాన్కి ఎంత శ్రమపడాల్సి వచ్చిందీ!!

ఆపాటి సాహసం చూపకపోతే జీవితమంతా చేదుగానే మిగిలిపోతుంది.

# రంగుల రాట్నం

కొద్ది నెలలపాటు తనని అసహ్యించుకుంటారు బంధువర్గమంతా. క్రమంగా వాళ్లే అలవాటు పడిపోతారు.

అయినా రాఘవరావుది తమకంటే అగ్రకులమే కదా!

ఈ బస్సింకా రావడంలేదేమిటి ఖర్మ!

కుడి కన్నదురుతోందెందుకనో—??

చీకట్లోకి గుచ్చిగుచ్చి చూస్తోంది యశోద.

ఆందోళన, భయం, ఆరాటం, ఉద్వేగంతో పాటు కొత్త అనుభూతి దాయిస్తోంది

* * *

ఆ బస్సు సరియైన వేళకే ఇచ్ఛాపురం విడిచిపెట్టి టెక్కలి వైపు పరుగు ప్రారంభించింది.

రాజపురంలో కొబ్బరికాయలు లోడ్‌చేసేసరికి గంటపైగా ఆలస్యమయింది. షావుకారు, డ్రైవరు లగేజి గురించి తగాదా పడ్తున్నారు.

ఆంధ్రపత్రిక
దినపత్రికలో
* మన సినిమాలు
* ప్రేక్షకుల తీర్పు
శీర్షికలు
చూస్తున్నారా?

ప్రయాణీకులు చాలసేపటి వరకు సహనం చూపేరు; కానీ ఎప్పటికీ తెగని లగేజీ బేరం వాళ్ల సహనాన్ని హరించింది.

మూక ఉమ్మడిగా కండక్టర్ మీద విరుచుకపడ్డారు.

కండక్టర్ మొదట్లో కొద్దిగా వాదించినా, పెరుగుతున్న గొంతుల్ని, ఆ గొంతుల్లో బలాన్ని తట్టుకోలేకా విజిల్ ఊదేడు.

డ్రైవర్ ఒక్కసారి నిర్లక్ష్యంగా అతన్ని చూసేడు.

షావుకారు గీచి గీచి బేరమాడుతున్నాడు.

కండక్టర్ తన సీట్లోంచే బిగ్గరగా కేకేసాడు, "ఏట్రా నీ కక్కుర్తి? అంతుపొంతూ లేకుండా పోతోంది. అయినా మడిసికి మరీ ఇంతాశ పనికి రాదురోయ్. నీ కోసమని ఎంతసేపు బస్సాపమంటావు?"

పొద్దున్న ఇచ్ఛాపురం సంతకి పేసింజర్లని మందలు మందలగా ఎక్కించినందుకు కండక్టర్ మీద చిరాకు పడ్డాడు డ్రైవర్.

ఆ ఉక్రోషాన్ని ఇలా బదులు తీర్చుకున్నాడు కండక్టరు.

ఆ మాటతో డ్రైవర్ కోపం నసాళాని కెక్కింది.

ఎటూ తెగని షావుకారు జిడ్డు బేరమ్మీద కోపం ఒక్కసారి చివ్వున పైకెగసింది కండక్టరు మీద.

"కక్కుర్తి నా కొడుకువి నువ్వురా — నేను కాదు. పొద్దున్న రెండు గంటల సేపు సంతబేరానికి బస్సులోడ్ చేస్తూ ఆలీసెం చేసినవ్వు దెక్కడికి పోయిందిరా నీ బుద్ధి?

నీతులు ఎదుటి వాడికి సెప్పడానిక్కాదొరేయ్. నీలాగ పతీ అర్ధరూపాయి టిక్కెటికీ కక్కుర్తి పడితే నేనూ నీలాగ బస్సు కొనీసుండే వోణ్ణి-" మాటామాటా పెరిగేయి.

తేదీలు, వారాలతో సహా ఒకర్నొకరు దెప్పుకుంటున్నారు.

ఇప్పుడు బస్సు నడవనందుకు పేసింజర్లేట్టి బాధపడ్డంలేదు. ఏ ఖర్చూ లేకనే ఒక్కని వినోదాన్ని తిలకిస్తున్నారు. క్లీనరు కుర్రాడు ఎటూ చెప్పలేక సతమత మవుతున్నాడు.

ప్రొప్రైటరు దగ్గర నీ గుట్టు మట్టులన్నీ బయట పెడ్తానని బెదిరించాడు డ్రైవరు.

చిన్న ప్రొప్రైటరుకి చెప్పి నీ ఉద్యోగం ఊడ పీకిస్తానన్నాడు కండక్టరు.

ఇద్దరి తప్పులకి ఉమ్మడి సాక్షిగా మిగిలేడు క్లీనరు.

మందసా హెడ్మేష్టరు, పాలంగపురం ప్రెసిడెంటు తాల్కాలికంగా ఇద్దరికీ రాజీ కుదిర్చేరు.

ఎలాగైతేనేం బస్సుకదిలింది.

డ్రైవరు రక్తం మరిగిపోతోంది.

కండక్టరు మనసు కకావికలయింది.

కసిగా ఏక్సిలేటరు త్రొక్కుతూ సూపర్ సోనిక్ జెట్‌లా బస్సు నడుపుతున్నాడు డ్రైవరు.

అడపా తడపా రోడ్డుప్రక్కగా నిలిచి చేతులెత్తుతున్న పేసింజర్లని కుమ్మరి పురుగుల్లా చూస్తున్నాడు కండక్టరు.

తారోడ్డుని చీలుస్తూ జెర్రిగొడ్డులా దూసుకుపోతోంది బస్సు.

ఆ వేగం కొందరికి థ్రిల్లింగ్‌గానూ, మరి కొందరికి ప్రాణసంకటంగానూ అనిపిస్తోంది.

తోక తెగిన చుక్కలా జర్రున దూసుకొస్తున్న బస్సు వేగానికి, శబ్దానికి భయపడి పశువుల కుర్రాళ్లు తప్పుకుంటున్నారు.

పశువుల మందలు చెల్లాచెదురుగా తలో దిక్కూ పరిగెడ్తున్నాయి

* * *

"అదిగో బస్సొచ్చేస్తోంది."

దాదాపు అరిచేడు రావులు.

నారాయణ మూయిస క్రమంగా బలహీనమవుతోంది.

వరదలా కారుతోంది నురగ.

"దద్దా — ఈణ్ణి బస్సులో నీసుకుంటాడంటావా?" అని తన అనుమానం బయటపెట్టిన ఎంకటేసాన్ని కొరకొరా చూసేడు రావులు.

"వేసికోక ఏం చేస్తాడయ్యా? మనిషి చావు బ్రతుకుల్లో కాదనడం వాడికి వశమా- అలా చేస్తే రేపే రూట్లో మళ్లీ బస్సు తిప్పగలడా?" అన్నాడు సత్యాం.

చీకటిని చీలుస్తూ బస్సు హెడ్‌లైట్లు ఎవ్వరూ ఊహించనంత వేగంగా దూసుకొస్తున్నాయి.

రావులు కండువా సరిచేసుకున్నాడు.

సత్యం రోడ్డు చివర్న నిలబడి చేతులడ్డం పెట్టేడు.

బస్సు మెరుపులా వాళ్లని దాటి పరుగెత్తింది.

రావులు బస్సు వెనుక కొంతదూరంగా పరిగెత్తేడు చివరి ఆశతో.

తుపాకీ గుండులా దూసుకుపోయింది బస్సు.

సత్యం గుండెల్లో భూకంపం.

నారాయణ పెళ్లాం గుండెల్లో అగ్నివర్షం

* * *

దూరంగా కన్పిస్తున్న బస్సులైట్లు యశోద ఆరాటాన్ని తీవ్రంచేసాయి. ఇప్పటికే ఆలస్య మయింది.

తనకోసం వెతకడం ప్రారంభించి ఉంటారు ఇంట్లో. పట్టుబడితే నరకం తప్పదు.

దేవుడు కరుణించేడు, బస్సు వచ్చేస్తోంది.

చుట్టూ ఒక్కసారి కలయచూసి, ముసుగు తలపైకి లాక్కుని రోడ్డు ప్రక్కన నిలబడింది యశోద.

బస్సు బాగా దగ్గరయింది.

యశోద చేయి చాచింది.

అయినా, బస్సు నిర్లక్ష్యంగా దూసుకు పోయింది.

దూరమవుతున్న ఎర్రలైట్లని చూస్తునే గుండె జారిపోయింది. ఏం చెయ్యాలో తెలీని అయోమయంలో నిస్సత్తువగా నిలబడింది.

ఆ క్షణంలో రాఘవరావు గుర్తుకిరాలేదు. తనని వేటాడ వస్తున్న చెన్నకేశవులే మనసులో మెదిలేదు. రెండు చేతుల్లో తన ముఖాన్ని దాచుకుని వెక్కివెక్కి ఏడుస్తోంది యశోద.

* * *

ఇవాళ అప్పుడే మంగళవారం — ఇచ్ఛాపురం బోర్డరు సెలవు. అట్నుండి లారీలు వచ్చే ఆశ కూడా లేదు.

ఈ బస్సుకి కాశీబుగ్గ చేరి ఉంటే కోణార్క ఎక్స్‌ప్రెస్‌లో ఎక్కి తెల్లారక ముందే కలికిమూర్తి ఎదుట హాజరయ్యేవాడు.

తనది తొలినుండి దురదృష్ట జాతకమే.

బ్రాహ్మణింట్లో పుట్టడంతోనే అవశృతి ప్రారంభమవుతుంది జీవితంలో. ఇంటికి ఈ దరిద్రపు ముఖాన్ని చూపాలంటే బాధగా ఉంది.

* * *

నారాయణ మూలుగు పూర్తిగా ఆగిపోయింది. అతని ఆత్మ పరమాత్మని వెతుక్కుంటూ పైకి ఎగిరి పోయింది. రావులు నిర్ధారణ చేసేడు నారాయణ చచ్చిపోయాడని.

నారాయణ పెళ్లాం గుండెలు బాదుకుని ఏడుస్తోంది.

మంచం నారాయణ శవాన్ని ఊరివైపు తీసుకుపోతోంది.

గాలికి కొట్టు మిట్టాడుతున్న లాంతర్లు తమ గుడ్డి వెలుతుర్లోవాళ్లని నడిపిస్తున్నాయి

కొందరు కావందుని తిట్టుకుంటుంటే, మరి కొందరు రేపటి తతంగం గురించి ఆలోచిస్తు న్నారు.

యాంత్రికంగా వాళ్ల వెనుక నడుస్తున్నాడు సత్యం.

* * *

యశోద అన్నలు ఆమెని వెతుక్కుంటూ వచ్చేరు

వేటగాళ్లకి చిక్కిన లేడిపిల్లలా ఆమె బెదిరి పోతోంది.

"సిగ్గులేదటే, ఎంతకిబరితెగించేవు?" చెంప చెళ్లుమనిపించేడు పెద్దన్న.

"అయిందేదో అయింది. ఈ సంగతి వేరెవరికీ తెలీకుండా జాగ్రత్తపడాలి"— అంటున్నాడు రెండో అన్న.

ఆమె జబ్బని బలంగా పడిసి పట్టుకున్నారు వారిద్దరూ.

ఆమె గింజుకోలేదు, రక్కలేదు.

వాళ్లతోపాటు అడుగులు కలుపుతోంది.

ఊరు క్రమంగా దగ్గరవుతోంది.

* * *

జీవితం గురించి ఎందరో ఎన్ని రకాలుగానో నిర్వచించేరు.

కొందరి సమాధులమీద కొందరి పునాదులు నిర్మింపబడతాయి.

ఒకరికి జరిగిన న్యాయం మరొకరికి అన్యాయమే అవుతుంది.

ఇవన్నీ—మన కళ్లకి కనిపించే దృశ్యాలు, సత్యాలు.

అయితే— కనబడని దేవుడే ఈ తోలుబొమ్మలాటని నిర్వహిస్తుంటాడంటారు వేదాంతులు

ఇప్పుడు దురదృష్టం అన్పించిన సంఘటనే మరోక్షణంలో అదృష్టం అనిపించగలదు కూడా.

జీవితంతో రాజీపడడం జీవితం కోల్పోవడం కన్నా ఉత్తమం.

చావు జీవితానికి ముగింపు.

రాజీ జీవితానికి పొడిగింపు.

ముగింపుకన్నా పొడిగింపు అందరూ కోరుకొనేదే కదా!

నీలావతి దాటి మరో రెండు మైళ్లు పరిగెత్తేకా బొడ్డపాడు జీడిమావిడి తోట దగ్గర భయంకరమయిన మలుపు తిరుగుతుంది రోడ్డు.

డ్రైవరు ఏక్సిలేటరు కసిగా తొక్కుతూ బస్సు పోనిస్తున్నాడు.

మలుపు కటువైపు ఒకటి, రెండు, మూడు వరుసగా పది గడ్డిబళ్ళు

బళ్ళకుర్రాళ్లు తొట్టెల్లో వళ్లగా నిద్రపోతున్నారు.

డ్రైవరు ఫర్లాంగు దూరంనుండే హారన్ కొడ్తున్నాడు

బళ్ళు దగ్గరయ్యేకొద్దీ అతనిలో సహనం నశిస్తోంది.

స్పీడు తిద్దామంటే రోడ్డు చాలదు.

గేరు మార్చేడు. పని చెయ్యలేదు.

బ్రేక్ తొక్కేడు. పట్టడంలేదు.

బళ్లు మరింత దగ్గరవుతున్నాయి.

ముచ్చెమటలు పోస్తున్నాయి డ్రైవరుకి.

తన బలమంతా కూడ గట్టుకుని స్టీరింగ్ చక్రం శక్తికొద్దీ తిప్పేడు ఎడం వైపుకి.

కంట్రోల్ తప్పిన బస్సు నేరేడు చెట్టుకు గుద్దుకుంది.

విస్ఫోటం—మంటలు.

ఆర్తనాదాలు—తెగిన శరీర భాగాలు.

రోడ్డు దిగి పొలాల్లోకి పరిగెత్తుతున్న ఎడ్ల బండ్లు.

తొట్టెల్లోంచి జారిపడ్తున్న బళ్ళకుర్రాళ్లు.

క్షణంలో ఆ ప్రాంతం శ్మశాన వాటికలా తయారయింది.

* * *

అందుకే ముగింపుకన్నా రాజీ మంచిదంటాను.

చావుకన్నా బ్రతుకు ప్రియమైనదంటాను. ●

